# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-03-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సంక్షేమ క్యాలెండర్ ని త్వరలో విడుదల చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.
- ❖ శ్రీకాకుళం జిల్లాలో ఆరు వరుసల రహదారులను నిర్మించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరిని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు కోరారు.
- ❖ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువస్తామని ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ తెలిపారు.
- ❖ ప్రపంచ స్థాయి వినోద రంగానికి సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.

====================

సంక్షేమ క్యాలెండర్ ని త్వరలో విడుదల చేయనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహిస్తున్న 6వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజు అయిన ఈ రోజు కొనసాగింది. సంక్షేమ పథకాల అమలుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలిండర్, ఫీజు రీఎంబర్స్‌మెంట్, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాల గురించి లబ్దిదారులకు తెలియచేయాలన్నారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ నెల 9 నాటికి 50.45 కోట్ల ఉచిత ప్రయాణాలను మహిళలు చేశారని, 1,775 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఆర్టీసీకి రీఎంబర్సు చేసిందని ముఖ్యమంత్రి వివరించారు. సంపద సృష్టితో పాటు.. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా కలెక్టర్లు చూడాలని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

====================

కేంద్ర రోడ్డురవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరిని పార్లమెంటులోని ఆయన కార్యాలయంలో పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ రోజు కలిశారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులను నితిన్ గడ్కరి దృష్టికి ఈ సందర్భంగా తీసుకునివచ్చారు. ప్రధానంగా 16 నెంబరు జాతీయ రహదారిలోని నరసన్నపేట నుండి ఇచ్ఛాపురం వరకు సుమారు వంద కిలోమీటర్ల రహదారిని ఆరు వరుసలు చెయ్యాల్సిందిగా కేంద్రమంత్రిని కోరారు. జిల్లాలో మూలపేట పోర్టు శరవేగంగా నిర్మాణం అవుతుండటంతో పాటు.. భవిష్యత్ అవసరాల కోసం ఆరు వరుసల జాతీయ రహదారి అవసరమని రామ్మోహన్ నాయుడు వివరించారు. అదే విధంగా శ్రీకాకుళం నగరంలోని నవభారత్ కూడలి వద్ద ఫ్లై ఓవర్ లేదా అండర్ పాస్ వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. అలాగే రాష్ట్ర రహదారులుగా ఉన్న కళింగపట్నం - శ్రీకాకుళం - పార్వతీపురం 145 కిలోమీటర్లు, గార - అలికాం - బత్తిలి 118 కిలోమీటర్ల రహదారిని జాతీయ రహదారులుగా మార్చాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ఇదిలా ఉండగా ఈ ప్రాజెక్టులపై క్షేత్ర స్థాయి పరిస్థితులతో కూడిన నివేదికను సిద్ధం చేయాలని నితిన్ గడ్కరి అధికారులను ఆదేశించారు.

====================

భారత రక్షణ రంగాన్ని పటిష్టం చేసేందుకు ఆంధ్రప్రదేశ్ ను సాగర్ డిఫెన్స్ సంస్థ ఎంచుకోవడం అభినందనీయమని రాష్ట్ర మానవ వనరులు, ఐ.టి. శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు మండలం జువ్వల దిన్నెలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న అటానమస్ మారిటైమ్ సిస్టమ్స్ డెవలప్మెంట్ సెంటర్ కు మంత్రి ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... వివిధ సంస్థలు తమ పరిశ్రమలకు రాష్ట్రాన్ని కేంద్రాలుగా ఎంచుకుంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలను తీసుకువస్తామని నారా లోకేశ్ వెల్లడిస్తూ....

(వాయిస్ 24 సెకన్లు)

====================

రాష్ట్రంలో ప్రపంచ స్థాయి వినోద మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. అందులో భాగంగా విశాఖపట్నంలో 100 కోట్ల రూపాయలతో భారీ అమ్యూజ్‌మెంట్ పార్క్, రిసార్ట్స్ ప్రాజెక్ట్ రాబోతోందని వెల్లడించారు. ముంబయిలో జరుగుతున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్‌మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్ (IAAPI) ఎక్స్‌పో-2026లో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక శాఖ, మెసర్స్ మోడర్న్ మస్తీ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఈ ప్రాజెక్ట్ కి సంబంధించి అవగాహన ఒప్పందం ఈ రోజు కుదిరింది. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ... వినోద రంగాన్ని రాష్ట్ర పర్యాటక వృద్ధికి ప్రధాన చిహ్నంగా మలిచే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో దాదాపు 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుందని చెప్పారు. దీని వలన 300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ నగరం గ్లోబల్ కోస్టల్ టూరిజం హబ్ వేగంగా ఎదుగుతోందని కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

విరామం

====================

వేసవిలో వడగాలుల వల్ల రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో 6వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండవ రోజున వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఈసారి వేసవి ప్రభావం ఎక్కువ ఉంటుందని అంచనాలు ఉన్నాయన్నారు. వడగాలుల ప్రభావంపై ముందుగానే ప్రచారం చేపట్టాలని కోరారు. ప్రజలు సురక్షితంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పని చేసే ఉపాధి హామీ శ్రామికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

====================

విశాఖపట్టణం ఎకనామిక్ రీజియన్ పరిధిలో ఐటీ పార్కుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ వివిధ శాఖల అధికారులను, నిప్పన్ కోయి కన్సల్టెంట్స్ ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఇరు వర్గాలతో విశాఖపట్టణం కలెక్టరేట్ లో ఈరోజు ప్రత్యేకంగా సమావేశమైన ఆయన.. ఐటీ రంగ అభివృద్ధిపై చర్చించారు. ఐటీ పార్కులు, డేటా సెంటర్లు, గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఏర్పాటులో భాగంగా ఐటీ కంపెనీలను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న ఐటీ క్లస్టర్లను మరింత విస్తరించడంతో పాటు.. కొత్తగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. ఐటీ సంస్థలు పెట్టుబడులు పెట్టేలా రోడ్ కనెక్టివిటీ, కమర్షియల్ స్పేస్, ఎంటర్‌టైన్‌మెంట్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలన్నారు.

====================

తిరుపతి జిల్లాలో కేంద్ర బృందం ఈ రోజు పర్యటించింది. శ్రీకాళహస్తి నియోజకవర్గం బొక్కసంపాళెం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధిలో ఆదర్శవంతంగా నిలవడంతో జాతీయ స్థాయి అవార్డుకు ఆ గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలోని పంచాయతీరాజ్ శాఖకు చెందిన కేంద్ర బృందంలోని సభ్యులు జావేద్, దీపేంద్ర కుమార్ లు పర్యటించి మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ముందుగా పరిశీలించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ప్రత్యేక అధికారి జావేద్ ఆకాశవాణితో మాట్లాడుతూ…

(వాయిస్ 21 సెకన్లు)

====================

విలువలు, విశ్వసనీయతకు మారుపేరుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిలిచిందని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ… రాష్ట్రంతో పాటు దేశ రాజకీయాల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఉనికిని చాటుకుంటోందన్నారు. పార్టీ ఆవిర్భవించి ఈరోజుకు 15 ఏళ్లు పూర్తి అయిందని ఆయన గుర్తు చేశారు.

====================

బాల్య వివాహాలు నివారణే ప్రభుత్వ ధ్యేయమని లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ పి. శ్రీధర్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల (కేజీబీవీ)లో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, నివారణ, పోక్సో యాక్ట్, టీనేజ్ గర్భం వలన కలిగే నష్టాలు, పోలీస్ సేవలు, మహిళలపై జరిగే వేధింపులు, వన్ స్టాప్ సెంటర్ సేవలు, మిషన్ వాత్సల్య సేవలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లుగా అధికారులు తెలిపారు.

====================

రాష్ట్రంలో గడచిన ఇరవై నెలల కాలంలో 5 లక్షల 39 వేల 841 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశామని గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన రెండవ రోజు జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ… ఇళ్ల నిర్మాణం కోసం 19 వేల 512.28 కోట్ల రూపాయలు ఖర్చు చేశామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మరో 5 లక్షల 27 వేల 479 ఇళ్లు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని చెప్పారు.

====================
====================